# జీవన మధుర్యం

అతను వస్తున్నాడేమోనని తెరచివున్న కిటికీలోనించి బయటకు చూస్తోంది మధుమతి. రోడ్డు కనపడుతోంది. అతడు కనపడితే ఆమెకు సంతోషం కలుగుతుంది. ఎందుకో తెలీదు. కానీ తెలుసు. సూర్యనారాయణ క్రమంగా తనకీ, తన మనసుకీ చేరువ అవుతున్నాడీమధ్య. అందువల్లనే ఈ అపరిమితమైన సంతోషం.

ఇంతకీ తను ఏం కోరుకుంటున్నది? తనలోకి తను తరచి చూసుకుంది మధుమతి. ఎందుకో తెలీదు. మనసులో అదే ఆలోచన గిరికీలు కొడుతోంది. వదిలి పోవటంలేదు. మనసునంతటినీ సూర్యనారాయణ ఆక్రమించుకున్నాడు.

వెంటనే జవాబు రాలేదు. కానీ ఒక్క విషయం స్పష్టంగా తెలుసు. తను సూర్యనారాయణ నీడను కోరుకుంటున్నది. అతడి సహచర్యాన్ని వాంఛిస్తోంది.

తలచుకున్నకొద్దీ చిత్రంగా అనిపిస్తోంది. ఒకవైపు ముందుకు వెడుతూనే మరోవైపు మనసు వెనక్కు లాగుతోంది. అవసరం ముందుకు నెడుతున్నది. తన గతం వెనక్కు లాగుతోంది. వికృతమయిన గతాన్ని తనకు మిగిల్చి పాపాన్ని మూట గట్టుకుని వెళ్లాడు ఆ దుర్మార్గుడు.

ఇంతకీ ఆ దుర్మార్గుడు ఎవరో కాదు. మధుమతి భర్త విభీషణరావు. పోయే క్షణం వరకూ భార్యను హింసిస్తూనే వున్నాడు.

అందువల్లనే సూర్యనారాయణ విషయంలో తను మళ్లీ తప్పటడుగు వేస్తున్నానేమోనని మధుమతి భయపడుతోంది. పోనీ, అతడినే అడిగితే ఎలా వుంటుంది.

ప్రయోజనం వుండదు. అతడు చిన్నగా నవ్వి వూరుకుంటాడు. మరీ అడిగితే "నీ నిర్ణయం తప్పు కాదు. నువ్వు తెలివైన దానివి" అంటాడు అంతే.

నిజమే. తను తెలివైనదే కానీ తన తెలివితేటలతో ప్రమేయం లేకుండానే తన జీవితం నూనెలో ముంచి తీసిన కాయితంగా కాలిపోయింది. అదేమిటోగానీ మొదట్లో బాగానే వుండేవాడు. తర్వాతనే ఆ అలవాటుకు బానిసైనాడు విభీషణరావు. తాగితాగి ఇహ తాగలేక ప్రాణాల్ని గాల్లో కలిపేసుకున్నాడు.

నిజంగానే ఏడుపు రాలేదు. చెర వదిలినట్లయింది. ఇలా అనుకోగూడదేమో! తప్పు విడుదలైన ఖైదీ తను పొందిన స్వేచ్ఛ గురించి ఆలోచించకుండా ఎలా వుండగలడు? తనూ అంతే.

భర్త మరణంవల్ల తను కోల్పోయింది ఏదీ లేదు. విభీషణరావు ప్రాణాన్ని పోగొట్టుకున్నాడు. అందువల్ల లోకం దృష్టిలో తను వైధవ్యాన్ని పొందింది. ఇట్స్ వెరీ నేచురల్. పెళ్లయిన ఏ ఆడదానికయినా గ్యారంటీ వుండని సంభ్రమణం.

తనూ చదువుకున్నది కాబట్టి భర్త చనిపోయిన ఆడదానిగా తనకు ఉద్యోగమిచ్చారు. ఉదర పోషణకి ఇబ్బంది లేదు. ఉన్న ఒక్క కూతురు రెండేళ్ల క్రితం పెళ్లయి భర్తతో కాపురం చేస్తోంది. ఇక తన జీవితానికి దిగులేదనుకుంది.

కానీ ఏదే పొరపాటు. మనసులో ఒక మూల ఏదో దిగులు గూడు కట్టుకుని వుంది. తను వెంటనే గ్రహించలేకపోయింది. తన సెక్షన్ ఆఫీసర్ సూర్యనారాయణతో పరిచయం స్నేహంగా మారుతున్నకొద్దీ ఆ దిగులుకు ఒక రూపు ఏర్పడసాగింది.

సరిగ్గా అప్పుడే తనలో ఒక నూతన చైతన్యం. తను గ్రహించకముందే కొంతమంది గ్రహించి వుంటారు. తనకు తెలిసినంతవరకు సూర్యనారాయణ మంచివాడు. పక్క వూరినించి ఆఫీసుకు వచ్చేవాడు. తనని గౌరవంగా చూస్తాడు. భర్త పోయిన ఆడదానిపట్ల కొంతమంది మగవాళ్లకు వుండే చులకన భావం ఆయనకు లేదు. ఆయన మాటల్లో మధుమతి పట్ల అభిమానం కనపడేది. అతడు తరచు ఆమెను ఆఫీసులో కలుసుకునేవాడు. ఆఫీసు పనిలో ఆమెకు సాయపడేవాడు. అతడి పక్కన వున్నప్పుడు ఆమెకు చాలా ఆనందం కలిగేది. ఆ ఆనందాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఆలోచన ఆమెలో సుడులు తిరుగుతోంది.

ఎట్టకేలకు నిరీక్షణ ఫలించింది.

సూర్యనారాయణ గేటు నెట్టుకుని లోపలకు వచ్చాడు. నవ్వుతూ ఆహ్వానించింది. అతడి చేతిలో ఒక చిన్న సంచీ వుంది. అతడు దాన్ని ఆమెకిచ్చాడు.

ఏమిటన్నట్టు చూసింది.

"బెండకాయలు మధూ.... మా పెరట్లో చెట్లకి కాస్తున్నాయి. చూడు ఎంత లేతగా వున్నాయో?" అన్నాడతను.

మధుమతి అతడికేసి ఆశ్చర్యంగా చూస్తూ "ఇంట్లో ఈ బెండకాయలు ఎవరికని చెప్పారు?" అనడిగింది.

"నీకనే చెప్పాను"

"ఇంట్లో ఆమె ఏమీ అనుకోదా?" తిరిగి అడిగింది.

సూర్యనారాయణ ఎప్పటిలాగే నవ్వి "అనుకోటానికి ఇందులో ఏముంది?

మనకి ఎక్కువగా వున్నవి లేనివాళ్లకు ఇవ్వటం సహజమే గదా.... అయినా నా భార్య సుమతి గురించి నీకు తెలీదు. ప్రతి చిన్నదానికీ అపార్థం చేసుకునే మనిషి కాదు".

"అయితే సుమతిగారిది విశాల హృదయమా?"

"అవును అలాగే అనుకోవచ్చు. నిజానికి ఆమె పేరు విశాలహృదయ అని పెడితే బావుండేది" అని మళ్లీ నవ్వాడు.

మధుమతి కూడా నవ్వి "కాఫీ చేస్తాను" అన్నది.

"వద్దు. ఇంతకుముందే తాగాను" అన్నాడతను.

"నాకోసం. నాకు తాగాలని వుంది. మీకోసం ఆగాను".

"అయితే సరే. నీకోసం తాగుతాను" అన్నాడు కుర్చీలో కూర్చుని.

మధుమతి లోపలకు వెళ్లింది. సూర్యనారాయణ గురించి ఆలోచిస్తూ కాఫీ చేసింది.

కాఫీ తాగుతున్నప్పుడు "ఇంట్లో ఏమని చెప్పారు?" అనడిగింది మధుమతి.

"ఇక్కడకు వస్తున్నట్టు చెప్పాను"

"రాత్రికి ఇంటికి తిరిగి వస్తానని చెప్పారా?" మళ్లీ అడిగింది.

"వస్తానని, రానని ఏమీ చెప్పలేదు. ప్రత్యేకంగా చెప్పటం ఎందుకు? ఎట్లాగో రాత్రికి వెళతానుగా" అన్నాడు సూర్యనారాయణ వక్కపొడి వేసుకుని.

"రాత్రికి వెళతారా?" కొంచెం దిగులుగా అడిగింది.

"ఏం వద్దా?"

"ఈ రాత్రికి వుంటే బవుండుననిపిస్తోంది" అన్నది కొంచెంగా తల ఎత్తి అతడిని చూస్తూ సగం చేతిని మొహానికి అడ్డుగా వుంచుకొని.

సూర్యనారాయణ తనదైన బాణీలో నవ్వి "కొంచెం వివరణ ఇచ్చుకోవాలి" అన్నాడు నవ్వుతు కొనసాగిస్తూ.

"అంటే ఏమిటి?" అర్థం కాక అడిగింది.

"ఒక అడదీ, ఒక మగాడు ఒక గదిలో లేక ఒక ఇంట్లో కలిసి పడుకుని నిద్రించటానికి ఒక కారణం, లేక ఒక సందర్భం వుండాలి. నిజానికి ఇప్పుడు ఆ రెండూ మనకు లేవని అనుకుంటున్నాను. నీ సంగతి నాకు తెలీదు. శారీరక వాంఛలు అంతగా వేధిస్తున్నాయా?" అనడిగాడు సూర్యనారాయణ.

మధుమతి సిగ్గుపడింది. పూర్తిగా తల దించుకుంది.

"నేనేమీ అనుకోను చెప్పు. తప్పు లేదు".

"అటువంటిదేమీ లేదు. మీకు చెరువలో వుండాలని అనిపించింది. అంతే" చిన్నగా అన్నది అతడికే వినిపించేలా.

"మధూ.... నిన్ను నేను చదివాను. నీ మనసు నాకు తెలుసు. నువ్వు నీ భర్త గురించి చెప్పావు. అది విని నువ్వు పోగొట్టుకున్నది ఏమిటో, నువ్వేం కోరుకుంటున్నావో గ్రహించాను. నిన్ను కోరుకోవటంలో నా స్వార్థం ఏదీ లేదు. నాకు అన్నీ వున్నాయి. సుఖంగా, సంతోషంగా వున్నాను. ఇదే నీకు ఇవ్వాలనుకున్నాను. నీకు దగ్గరయ్యాను. కొంతమంది మంచివాళ్ళు కూడా కొన్ని రకాల చెడ్డపనులు చేస్తారు. భార్య బతికుండగా మరో స్త్రీని వివాహం చేసుకోవడం సమాజం దృష్టిలో మంచి పని కాదు. కానీ...."

"అయితే సిద్ధపడరా?" క్యూరియస్‌గా అడిగింది.

సూర్యనారాయణ నవ్వి "ఇప్పటికే ఈ విషయంలో మన ఆలస్యం అమృతం దగ్గర ఆగి వుంది. అది విషం దాకా వెళ్ళకముందే పెళ్లి చేసుకుందాం. అన్నీ చూసుకునే బయల్దేరాను. నువ్వు అంగీకరిస్తే ఈ రాత్రికి ఎనిమిది గంటలకు మంచి ముహూర్తం వుంది" అన్నాడు.

"ఈ రాత్రికా? ఎక్కడా?"

"ఇక్కడే ఈ ఇంట్లో దేవుడి మందిరం ఎదుట. గుళ్లో వుండే దేవుడు ఇక్కడా వున్నాడు. ఏమంటావ్?" అన్నాడు సూర్యనారాయణ.

మధుమతికి మాట రాలేదు. కృతజ్ఞతతో అతడికేసి చూసింది.

"నీ మనసులో ఏదయినా ఆలోచన వుంటే చెప్పు మధూ.... నేనేమీ అనుకోను. ఇందులో సగభాగం నీది" అన్నాడు సూర్యనారాయణ నవ్వు మొహాన్ని తప్పించి.

అప్పటికే మధుమతి ఏమీ చెప్పలేకపోయింది. ఏం చెప్పగలదు? అంతా ఆయనే చూసుకుంటున్నాడు.

"మీ ఇష్టమే నా ఇష్టం" అన్నది మాటలను వెతుక్కుని.

తర్వాత లేచి అతడు తెచ్చిన బెండకాయలను ముక్కలు కోసి కూర చేసింది.

వంటయ్యాక ఇద్దరూ భోజనం చేశారు. తన భర్త విభీషణరావుతో కలగని అనుభవం తొలిసారిగా కాబోయే భర్త సూర్యనారాయణ వల్ల మధుమతికి కలిగింది.

అతడి ఎదురుగా కూర్చుని అతడికి వడ్డిస్తూ తను భోజనం చేస్తున్నప్పుడు ఏదో తెలియని ఆనందం కలిగింది. మనుసులోనే అతడికి థాంక్స్ చెప్పుకుంది.

భోజనమయ్యాక సాయంత్రం వరకు సూర్యనారాయణ నిద్రపోయాడు. తర్వాత లేచి బజారుకు వెళ్లాడు.

మధుమతికి మనసంతా అలజడిగా వుంది. సంతోషంతో కూడిన అలజడి. విభీషణరావుతో తన వైవాహిక జీవితమంతా స్టవ్ మీద మరుగుతున్న పాలగిన్నెలాగా గడిచిపోయింది. పెళ్లికి ముందు తను కన్న కలలన్నీ ముక్కలు ముక్కలుగా చింపి గాల్లోకి ఎగరేసిన కాయితం ముక్కల్లా ఎగిరిపోయాయి. సూర్యనారాయణతో తన పునర్వివాహం తనకో కొత్త జన్మ కొత్త జీవితం. తన సుఖంకోసం, సంతోషంకోసం అతడు ఒక సాహసం చేస్తున్నాడు. నిజానికి అతడికి ఆ అవసరం ఎంతమాత్రమూ లేదు. సూర్యనారాయణకు అన్నీ వున్నాయి. అతడు తనలా కాదు. తనకోసం రిస్కు తీసుకోటానికి సిద్ధపడిన అతడిమీద మధుమతికి అంతులేని ప్రేమ పుట్టుకొచ్చింది.

రాత్రి ఏడు గంటలు దాటుతున్నప్పుడు సూర్యనారాయణ చేతిలోని ఒక బేగ్ పట్టుకుని వచ్చాడు. అప్పుడు మధుమతి దేవుడి మందిరాన్ని సర్దుతోంది.

"ఏమున్నాయందులో" అనడిగింది.

"తర్వాత చెబుతాను" అన్నాడతను.

మధుమతి మౌనం వహించింది. ఇతను చిత్రమైన మనిషిలా అగుపించాడు. తర్వాత ఇద్దరూ ఒకరొకరిగా తలస్నానం చేశారు.

ప్రత్యేకంగా కాకపోయినా ఇంతకుముందు కొని వుంచుకున్న కొత్త చీరను కట్టుకుంది మధుమతి. సూర్యనారాయణ తను తెచ్చుకున్న కొత్త పంచెను కట్టుకున్నాడు. ఎప్పుడూ ప్యాంటుతోనే కనపడే సూర్యనారాయణ పంచె కట్టుకుంటే మధుమతికి కొత్తగా అనిపించాడు.

మధుమతి వంగి సూర్యనారాయణ పాదాలకు నమస్కరించింది. అతడు ఆమెను లేవనెత్తుతూ "నాకు నీ ప్రేమ కావాలి మధుమతీ" అన్నాడు. మధుమతికి నవ్వొచ్చింది. తర్వాత ఇద్దరూ దేవుళ్లకు నమస్కారం చేశారు.

కొత్త బట్టలతోనే మధుమతి వంట చేసింది.

ఇల్లంతా దీపాలు వెలుగుతున్నాయి. అటూ ఇటూ తిరుగుతూ డ్రెస్సింగ్ టేబుల్ ముందుకు వచ్చినప్పుడు ఆ అద్దంలో తన ప్రతిబింబం తనకే కొత్తగా

అనిపించింది మధుమతికి. కాంతులీనుతోంది. పెళ్లి కళలో మామూలు మనిషి ఇలా వుండటాన్నే లలితమంటారు కాబోలు అనుకుంది. ఆమె ఎమ్మే తెలుగు చదువుకుంది.

"భోజనం వడ్డించమంటారా?" మధుమతి అడిగింది.

సూర్యనారాయణ తల వూపాడు.

"నాకు బెండకాయ కూర ఇష్టమని నీకు తెలిసిపోయింది గదా మధుమతీ! నీకు ఏ కూర ఇష్టమో చెప్పవా? అనడిగాడు సూర్యనారాయణ.

"వంకాయ కూర" చెప్పింది చిన్నగా.

"గుడ్! అయితే ఇకనించీ ఇంట్లో ఎప్పుడూ వంకాయలు వుండేలా చూసుకుంటాను" అన్నాడతను.

"ఏ ఇంట్లో" అన్నది మధుమతి నవ్వి.

"ఈ ఇంట్లో.... ఈ చిన్నింట్లో" అన్నాడతను నవ్వి. ఆ మాటకు మధుమతి మనసారా పెద్దగా నవ్వింది.

నవ్వడం ఆపీ "తర్వాత చెబుతానన్నారు ఇంతకీ ఆ బేగ్‌లో ఏముంది?" అనడిగింది మధుమతి.

"తీసి చూడు తెలుస్తుంది".

మధుమతి తీసింది. అందులో నాలుగు రకాల స్వీటు ప్యాకెట్లూ, నాలుగు తీపి కిళ్లీలూ, మల్లెపూలు వున్నాయి.

"స్వీటు లేకుండా భోజనం యేమిటి? భోజనంలో ఈ స్వీట్లు కూడా వడ్డించు" అన్నాడతను.

ఆమె అలాగే చేసింది.

కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించారు. తర్వాత ఇద్దరూ కిళ్లీలు వేసుకున్నారు.

సూర్యనారాయణ టీవీ చూస్తున్నప్పుడు మధుమతి బెడ్‌మీద దుప్పటి మార్చి కొత్త దుప్పటి పరిచి తలగడలు సర్దింది. తనకు తెలీకుండానే ఆ పనుల్లో తను కనబరుస్తున్న శ్రద్ధ ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. తన మాజీ భర్త బతికి వున్నప్పుడు ఈ శ్రద్ధంతా ఏమయినట్టు అని అనుకుంది.

అతడు తెచ్చిన మల్లెపూలను తలనిండా పెట్టుకొని "అగరొత్తులు

వెలిగించమంటారా?" అనడిగింది మధుమతి.

"వెలిగించు. ఒక్కటి కూడ తగ్గటానికి వీల్లేదు. అన్నీ సంప్రదాయ సిద్ధఇంగా జరిగిపోవాలి. లోటు వుండకూడదు" అన్నాడు.

తర్వాత లేచి వచ్చి బెడ్‌మీద కూర్చుని "మధుమతీ ఇది మన పాలిట తొలిరాత్రి కాదు. శుభరాత్రి" అన్నాడు. మధుమతి వచ్చి అతడి పక్కన కూర్చుంది. "అప్రస్తుతం అనుకోకు. నీకో విషయం చెప్పాలి" అన్నాడతను బెడ్‌మీద సరిగ్గా పడుకుని. ఏమిటన్నట్టు చూసింది.

"తాళి కట్టకుండా ఆడదాన్ని ముట్టుకుంటే తప్పు. ఎడబాటనేది మనుషుల్ని కుంగదీస్తుంది. ఇలా జరుగుతుందని తెలిసే ఎనిమిది గంటలు ముహూర్తమని నీకు అబద్ధం చెప్పాను. నిజానికి నకేమీ తెలీదు. మంచి, చెడు అనేవి మనుషుల్లో వుంటాయి" అన్నాడు.

"అదృష్టవంతురాలిని" అన్నది మధుమతి.

"నీ మొహం. ఇది కూడా ఒక అదృష్టమేనా? ఇంకా విను. భార్యభర్తలిద్దరూ కలిసి పడుకుని శరీరాలను కలుపుకుని పొందుతున్నామనే శారీరక సౌఖ్యం అనే దాంట్లో నిజంగా సుఖముండదు. ఒకవేళ ఎంతో కొంత వుందనుకున్నా అది శరీరాలకే పరమితం. మనసు దాకా వెళుతున్నట్లు అనిపిస్తుంది గానీ వెళ్లదు. అది ఎప్పటికీ ఒక అనుభవంగానే గుర్తుంటుంది గానీ నిజమైన అనుభూతిగా మారి ఆనందాన్నివ్వదు" అన్నాడు సూర్యనారాయణ.

"మీ దృష్టిలో నిజమైన ఆనందం ఏది?" మధుమతి అడిగింది.

"భార్యాభర్తలు ఒకరి కోరికలను ఒకరు తెలుసుకొని వాటిని మన్నించుకుంటూ వుంటే నిజమైన ఆనందం కలుగుతుంది. ఒకరికోసం ఒకరం అనే ఫీలింగ్ ఏర్పడితే జీవితాల్లో ఒక నిశ్చిత భావం కలుగుతుంది. ఇందుకేనేమో నాకూ రామాయణంలో ఒక దృశ్యం ఎప్పుడూ గుర్తుకొస్తూ వుంటుంది.

"ఏమిటది?"

"సీతాదేవి గర్భవతిగా వున్నప్పుడు ఆమె శీలం గురించి ఒక నింద పడుతుంది. శ్రీరాముడు ఆమెను తన నివాసం నించి పంపటానికి నిశ్చయించుకుంటాడు. ఆ ముందురోజు రాత్రి సీతతో ఆయన "సీతా – నువ్వు గర్భవతివి గదా.... నీ మనసులో వున్న కోరిక ఏమిటో చెప్పు.... తీరుస్తానంటాడు. అందుకామె అడవుల్లో మునుల ఆశ్రమాలను దర్శించి మనిపత్నులకు కానుకలను

ఇచ్చి రావాలని వుంటుందని" చెబుతుంది. శ్రీరాముడు సరేనంటాడు. భార్యను ఎడబాసే సమయంలో కూడా శ్రీరాముడు భర్తగా తన ధర్మాన్ని నిర్వర్తించాడు. భార్యభర్తలు ఎలా వుండాలో తెలుసుకోటానికి ఈ ఒక్క దృశ్యం చాలు" అన్నాడు సూర్యనారాయణ.

తను మరోసారి పొరపాటు చెయ్యలేదనే తృప్తితో సూర్యనారాయణ ఎదమీద పడి తెల్లవారే వరకూ నిశ్చింతగా నిద్రపోయింది మధుమతి. ❖

*నవ్య వీక్లీ, 11-1-2012*